క్లుప్తంగా

మెడికల్ షాపు ప్రారంభించిన ఎమ్మెల్యే మధు


ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

శ్రీకాళహస్తి :పట్టణంలోని బీపీ అగ్రహారం మలుపులో బుధవారం కవితా మెడికల్స్ అండ్ ఫాన్సీ షాపును ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు షాప్ యజమాని సురేష్ రెడ్డి, కవిత దంపతులు ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు మందులు డిస్కౌంట్ ధరలో అందించాలని సూచించారు. వైఎస్సార్ సీపీ నాయకులు వయ్యాల కృష్ణారెడ్డి, పగడాల రాజు, అరవింద్ రెడ్డి, మున్నా, ఆర్కాట్ శంకర్, శ్రీకాళహస్తి డ్రగ్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద, డాక్టర్ ఏడుకొండలు, డాక్టర్ మోహన్ పాల్గొన్నారు.

శ్రీరామాలయ నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజ చేస్తున్న పవిత్రారెడ్డి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): మండలంలోని దైనేడు ఎస్సీ కాలనీలో నూతన శ్రీసీతారామాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి బుధవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మణి, వైఎస్సార్ సీపీ తొట్టంబేడు మండల కన్వీనర్ ఉన్నం వాసుదేవనాయుడు, నాయకులు నాగరాజు, గంగయ్య, వెంకటాచలం, ధనుంజయ, జగదీష్, మురళి, వెంకటేష్, గోవర్ధన్, యుగంధర్, అంకయ్య పాల్గొన్నారు.

సురుటుపల్లెలో తమిళ న్యాయమూర్తులు


న్యాయమూర్తులకు ప్రసాదాల అందజేత

నాగలాపురం: మండలంలోని ప్రసిద్ధ సురుటుపల్లె పళ్లికొండేశ్వరస్వామి ఆలయాన్ని బుధవారం తమిళనాడు రాష్ట్రం పొన్నేరి సివిల్ న్యాయమూర్తి అయ్యప్ప, ఊత్తుకోట న్యాయమూర్తి సెంతామిగు సెల్వం దర్శించారు. వారికి ఆలయ చైర్మెన్ ఏవీఎం మునిచంద్ర శేఖర్‌రెడ్డి, ఈఓ రామచంద్రారెడ్డి స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వదించగా, చైర్మన్ తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ప్రజల ఆరోగ్యానికి సురక్ష భరోసా


సత్యవేడు : కంటి అద్దాల పంపిణీ

సత్యవేడు: ప్రజల ఆరోగ్యానికి సురక్ష శిబిరాలు భరోసా ఇస్తున్నాయని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర కె.సుశీల్ కుమార్ రెడ్డి, ఎంపీడీఓ కె. చంద్రశేఖర్ అన్నారు. బుధవారం ఇరుగుళం సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యంపై సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని బలోపేతం చేసి మరిన్ని వ్యాధులను చేర్చారని తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజల వద్దకే నిపుణులైన డాక్టర్లను పంపి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. శిబిరంలో తిరుపతి రుయా డాక్టర్ పృధ్వీణి, లావణ్య గైనకాలజిస్టు, పీహెచ్‌సీ వైద్యాధికారులు మురళీకృష్ణ, లావణ్య, జనరల్ సర్జన్ కలసి 438 మంది రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. 39 మందికి కంటి అద్దాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జి. శేఖర్, ఎంఈఓ కె.రవి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ చెంచులక్ష్మి సచివాలయ కార్యదర్శి ప్రకాష్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యమే లక్ష్యం

ఏర్పేడు: మండలంలోని రావిళ్లవారికండ్రిగలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. 235 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందుల కిట్లు అందజేశారు. వైద్యాధికారులు శివప్రియ, నాగరాజు, శిల్ప, సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకుడు గోపీ యాదవ్ పాల్గొన్నారు.

స్విమ్స్‌లో రిజర్వేషన్ అమలు

తిరుపతి తుడా: స్విమ్స్ యూనివర్సిటీలో ఇటీవల ఉద్యోగ నియామకాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ 100 శాతం అమలు చేశారని టీటీడీ, స్విమ్స్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘాల నాయకులు పరమశివన్, ఎం.ప్రసాదరావు, అమర్‌నాథ్ హర్షం వ్యక్తం చేశారు. వారు బుధవారం స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్‌ను కలిసి అభినందనలు తెలిపారు. వారు మాట్లాడుతూ పదోన్నతుల్లో రిజర్వేషన్‌ను అమలు చేయాలని, బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. స్విమ్స్ డైరెక్టర్ మాట్లాడుతూ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. నాయకులు రామ్మూర్తి, కే.భూపాల్, గంగాధర్, బెనర్జీ, హరిప్రసాద్, సురేష్ పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు జనం బ్రహ్మరథం


పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి


గడప గడపకు కార్యక్రమంలో అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: జగనన్న సంక్షేమ పాలనతో అన్ని వర్గాలు సంతోషంగా ఉన్నాయని, ఎక్కడికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పట్టడమే ఇందుకు నిదర్శనమని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని 4వ వార్డు ముత్తరాశిపాలెం, నక్క హరిజనవాడ, సున్నపు, హరిజనవాడ, ఏనుగులగుంటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. 420 ఇళ్లను సందర్శించి, ప్రజలతో మమేకమయ్యారు. పింఛన్ వస్తోందా, పథకాలు అందుతున్నాయా అంటూ ఆరా తీశారు. ఆయా ప్రాంతాల్లో మహిళలు కర్పూర హారతులతో స్వాగతం పలికి బ్రహ్మరథం పట్టారు. నాయకులు క్రేన్ ద్వారా భారీ పూలమాలతో ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పూర్తి స్థాయిలో మేనిఫెస్టో అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పారదర్శక పాలన అందిస్తున్నారని పేర్కొన్నారు. అర్హతే ప్రామాణికంగా పథకాల లబ్ధి ఇంటి ముంగిటకే అందిస్తున్నట్లు తెలిపారు. ఏ ఏ ఇంటికి ఎంత లబ్ధి అందింతో అంకెలతో వివరిస్తూ సంక్షేమ బావుటా కరపత్రాలను అందజేశారు.

నిత్యం అందుబాటులో..

తాను నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని, ఎలాంటి సమస్య ఉన్నా పార్టీ కార్యాలయంలో తనను కలసి విన్నవించవచ్చని ఎమ్మెల్యే మధు తెలిపారు. 30 ఏళ్ల పాటు పాలన చేసిన బొజ్జల కుటుంబం శ్రీకాళహస్తి అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోలేదని ఆరోపించారు. ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం వారి చిరునామా హైదరాబాద్‌గా మారేదని తెలిపారు. కరోనా సమయంలో కూడా తాను ప్రజలకు అందుబాటులో ఉంటూ అనేక సహాయ కార్యక్రమాలు చేసినట్లు గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ప్రజలు విన్నవించిన కాలువలు, రోడ్డు, వీధి దీపాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన హామీలు నెరవేర్చక పోవడంతో ప్రజల వద్దకు రావాలంటేనే టీడీపీ నాయకులకు ధైర్యం చాలడం లేదని తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని మరోసారి ఆదరించాలని కోరారు. జగనన్న మళ్లీ సీఎం అయితే మరిన్ని పథకాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జనార్దన్‌రావు పవార్, గుమ్మడి బాలకృష్ణయ్య, లోకేష్ యాదవ్, పగడాల రాజు, సిరాజ్, ముత్యాల పార్థసారథి, చేతరశి పంతులు, డాక్టర్ శంకర్, శ్రీకాళహస్తి ఆలయ బోర్డుమెంబర్ బుల్లెట్ జయ శ్యామ్, పసల సురేష్, యుగంధర్ రెడ్డి, జయరామయ్య, అప్పిని సుధాకర్, సిద్దులు గారి మురళి, కంట ఉదయ్ కుమార్, పటాన్ ఫరీద్, కోళ్లూరు హరినాయుడు, వడ్లతాంగల్ బాలాజీ ప్రసాద్ రెడ్డి, ఫజల్, కొట్టే శరవణ, శివ కుమార్ యాదవ్, పసల కృష్ణయ్య, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు

ఆర్డీఓగా బాధ్యతలు స్వీకరించిన రవిశంకర్ రెడ్డి


రవిశంకర్ రెడ్డి

శ్రీకాళహస్తి : 'రెవెన్యూలో కింది స్థాయి నుంచి వచ్చానని.. సమస్యలపై అవగాహన ఉందని.. రెవెన్యూ, భూ సమస్యలు త్వరితగతిన పరిష్కారమయ్యేలా కృషి చేస్తాను' అని ఆర్డీఓ రవిశంకర్ రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి ఆర్డీవోగా బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఆర్డీవో కేఎస్ రామారావు విజయవాడ దుర్గమ్మ ఆలయ ఈవోగా బదిలీ అయిన విషయం తెలిసిందే. కడప జిల్లా నుంచి రవిశంకర్ రెడ్డి ఇక్కడికి వచ్చారు. శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్‌గా ఏర్పడిన తర్వాత రెండేళ్లలో మూడో ఆర్డీవోగా రవి శంకర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఉద్యోగులు ఆయనకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ తాను 15 ఏళ్ల తహసీల్దార్‌గా పనిచేశానని, శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు తన సాయ శక్తుల కృషి చేస్తానని తెలిపారు.

జగనన్న గోరుముద్దకు వంట పాత్రలు


పాత్రలను పరిశీలిస్తున్న ఎంఈఓ రవి

సత్యవేడు: మండలంలో 65 పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారీకి జగనన్న గోరుముద్ద పథకం కింద 65 కిట్లు, 8రకాల వంట పాత్రలు, వడ్డింపు గిన్నెలు, గెరిటెలు, అన్నం తయారీకి పెద్ద పాత్రలు మంజూరైనట్లు ఎంఈఓ కె.రవి తెలిపారు. బుధవారం సాయంత్రం ఎంపీడీఓ కె.చంద్రశేఖర్ కలసి ఎంఈఓ ఎంఆర్సీ కార్యాలయంలో వంట పాత్రలను పరిశీలించారు. గురువారం పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేయనున్నట్లు ఎంఈఓ తెలిపారు. మండలానికి రూ.6.8 లక్షల విలువగల స్టీల్ వంటపాత్రలు సరఫరా అయినట్లు వివరించారు.

శ్రీవేంకటేశ్వరాలయ నిర్మాణం

రూ.10 లక్షలు మంజూరు చేసిన టీటీడీ


భూమిపూజ చేస్తున్న గ్రామస్తులు

వరదయ్యపాళెం: మండలంలోని సాతంబేడు దళితవాడలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి బుధవారం గ్రామస్తులు శాస్త్రోక్తంగా భూమి పూజ చేశారు. ఆలయ నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం వారు రూ. 10లక్షలు మంజూరు చేశారు. సనాతన హిందూ ధర్మాన్ని విస్తృతంగా ప్రచారం చేయడంలో భాగంగా శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం నిర్మాణాలకు ప్రోత్సాహం ఇస్తున్న టీటీడీ సేవలు అభినందనీయమని మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు దామోదర్‌రెడ్డి అన్నారు. అందులో భాగంగా సాతంబేడు దళితవాడలో ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, సర్పంచ్ చంద్రయ్య, గ్రామ పెద్దలు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే అభివృద్ధి సాధ్యం




తొట్టంబేడు: హాజరైన పార్టీశ్రేణులు, మాట్లాడుతున్న బియ్యపు పవిత్రారెడ్డి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డితోనే అభివృద్ధి సాధ్యమని వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చిన్నసింగమాల కేసీఆర్ ఆర్ కల్యాణ మండపంలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకుకావాలంటే' కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ గత ఎన్నికల్లో జగనన్న ఇచ్చిన మేనిఫెస్టోలో 99 శాతం హామీలను నెరవేర్చారని పేర్కొన్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అందజేసిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించేందుకు నవంబరు 3న చిన్నసింగమాల వీరభద్రస్వామి ఆలయం నుంచి సామాజిక సాధికార బస్సు యాత్ర ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల నాయకుడు ఉన్నం వాసుదేవనాయుడు, మండల అధ్యక్షుడు శంకరయ్య, సింగిల్‌విండో అధ్యక్షుడు మణి నాయుడు, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు ఢిల్లీబాబు, కో–ఆప్షన్ సభ్యుడు ప్రేమకుమార్, శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యుడు భాస్కర్, ఏర్పేడు జెడ్పీటీసీ సభ్యుడు తిరుమలయ్య, నాయకులు రమేష్, భక్తవత్సలం తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి..

రేణిగుంట: రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగాలంటే జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. బుధవారం రేణిగుంట వైఎస్సార్ సీపీ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం సాయంత్రం జరిగిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో జగనన్న నవరత్న పథకాలు తీసుకొచ్చి పేదల ఆర్థిక స్థితిగతుల్లో చేదోడుగా నిలిచారన్నారు. నాలుగేళ్ల పాలనలో ప్రతి కార్యక్రమం అట్టడుగు వర్గాల ప్రజల అభ్యున్నతి, భావితరాల బాగుకై దూరదృష్టితో రూపకల్పన చేసి ముఖ్యంగా విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులను తీసుకొచ్చారని తెలిపారు. జగనన్న పాలనలో జరిగిన మంచిని ప్రతి గడపకు తీసుకెళ్లి, విపక్షాలు చేసే విష ప్రచారాన్ని తిప్పి కొట్టాలని పార్టీ నాయకులు, కార్యకర్తలను పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో గతంలో పాలించిన నాయకులు గెలిచాక, ప్రజలకు కనిపించకుండా హైదరాబాద్‌లో కూర్చుని సొంత వ్యాపారాలను అభివృద్ధి చేసుకున్నారని, ఎమ్మెల్యేగా బియ్యపు మధుసూదన్‌రెడ్డి గెలిచిన నాటి నుంచి నియోజకవర్గ ప్రజలకు సేవకుడిగా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి కష్ట,నష్టాలలో పాలుపంచుకుంటున్నారన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు కావేరి తిరుమలయ్య మాట్లాడుతూ జగనన్న పాలనలో చేకూరిన లబ్ధి, మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు టి.సంధ్యారాణి, మండల అధ్యక్షుడు గంగారి రమేష్, వైస్ ఎంపీపీ సుజాత, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, సర్పంచ్ నగేషం, జువ్వల దయాకర్‌రెడ్డి, రసూల్, యోగేశ్వరరెడ్డి, మునిశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడు మృతి


హరిప్రసాద్ (ఫైల్)

ఏర్పేడు: మండలంలోని పెనుమల్లం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు హరిప్రసాద్(46) బుధవారం మృతిచెందారు. వారం కిందట గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు చైన్నైలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బుధవారం చికిత్స పొందుతూ మృతిచెందారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆయన మృతికి వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు తిరుమలయ్య, పార్టీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్ తదితరులు సంతాపం తెలిపారు.

కువ్వాకొల్లి బీటీ రోడ్డు ప్రారంభం



కువ్వాకొల్లికి సీసీఎల్ పరిశ్రమ నిర్మించిన బీటీ రోడ్డు, శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సీసీఎల్ పరిశ్రమ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు

వరదయ్యపాళెం: మండలంలో సంతవేలూరుకు వెళ్లే ప్రధాన రోడ్డు నుంచి కువ్వాకొల్లికి కిలోమీటర్ మేరకు కొత్తగా నిర్మించిన బీటీ రోడ్డును బుధవారం ప్రారంభించారు. గతంలో వేసిన రోడ్డు పూర్తిగా మరమత్తులకు గురికావడంతో గ్రామస్తుల విన్నపం మేరకు పంచాయతీ పరిధిలోని సీసీఎల్ కాఫీ పరిశ్రమ యాజమాన్యం ముందుకొచ్చింది. తమ పరిశ్రమకు చెందిన సీఎస్‌ఆర్ నిధులు రూ. 21లక్షలతో కిలోమేటర్ మేరకు బీటీ రోడ్డుగా నిర్మించింది. బుధవారం మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు దామోదర్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు, సర్పంచ్ చంద్రయ్య, ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు, సీసీఎల్ పరిశ్రమ పీఆర్వో కిషోర్, డీజీఎం సురేష్ లాంఛనంగా రోడ్డును ప్రారంభించి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పరిశ్రమ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అమ్మా భవానీ.. మా కన్నతల్లీ


ప్రత్యేకాలంకరణలో వాసవీ కన్యకాపరమేశ్వరి


నల్లగంగమ్మ ఆలయంలో విశేషాలంకరణ


ప్రత్యేకాలంకరణలో వేదం కాళికామాత


శ్రీకాళహస్తి ఆలయంలో కనకదుర్గమ్మ

శ్రీకాళహస్తి : దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో ఒక్కోరోజు ఒక్కో అలంకారంతో దర్శనం ఇచ్చిన అమ్మవార్లకు బుధవారం శాంతి అభిషేకాలను వైభవంగా నిర్వహించారు. అనంతరం అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. శ్రీకాళహస్తీశ్వస్వామి ఆలయంలోని కనక దుర్గమ్మ అమ్మవారికి అభిషేకం అనంతరం మల్లెపూలతో సర్వాంగ సుందరంగా అలంకరించి పూజలు చేశారు. వేదం మిట్టకండ్రిగలోని కాళికామాత ఆలయంలో అమ్మవారిని పసుపు వస్త్రాలు వేపకుతో అలంకరించి పూజలు చేశారు. బహుదూర్‌పేటలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి, ఏడు గంగమ్మ గుడి, పానగల్ పొన్నాలమ్మ ఆలయంలో, బీపీ అగ్రహారంలోని చిన్న, పెద్ద గంగమ్మలకు, భాస్కర్ పేటలోని చాముండేశ్వరి ఆలయం, బజారు వీధిలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో శాంతి అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవార్లను దర్శించి తరించారు. ఓం శక్తి .....పరాశక్తి... జై భవాని... జై జై భవాని.... అనే నామస్మరణతో ఆలయాల పరిసరాలు మార్మోగాయి.

శాస్త్రోక్తంగా ఏకాదశి ఉత్సవం


నారాయణవనం: తిరుచ్చిపై ఊరేగింపు


నాగలాపురంలో..

నారాయణవనం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధ ప్రసిద్ధ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఏకాదశి ఉత్సవం వేడుకగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచి నిత్యపూజా కైంకర్యాలను అర్చకులు పూర్తి చేశారు. ఏకాదశి గడియల్లో అర్చన పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం శ్రీదేవి,భూదేవి సమేతంగా స్వామి వారి ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చారు. తదుపరి తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవర్లకు ఆస్థానం నిర్వహించి నైవేద్య సమర్పణ చేశారు. ఆలయ అధికారి నాగరాజు, భద్రతా జమేదార్ రాజశేఖర్ పర్యవేక్షించారు.

నాగలాపురంలో..

నాగలాపురం: ఏకాదశి సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీవేదవల్లి సమేత వేదనారాయణ స్వామి ఆలయంలో బుధవారం విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. సాయంత్రం ఉత్సవ మూర్తులకు ప్రత్యేకంగా అలంకరించి తిరుచ్చిపై పురవీధుల్లో ఊరేగించారు. టీడీడీ ఆలయ అధికారులు శ్రీనివాసులు, ఉదయ కుమార్ పర్యవేక్షించారు.

శ్రీమద్భాగవతంతో ఆధ్యాత్మిక జ్ఞానం

- శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి
- ముగిసిన భాగవత సప్తాహ మహోత్సవం


శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డితో భాగవత భక్త సమాజ బృందం

సత్యవేడు: భగవంతుడు మన మనస్సులోకి ప్రవేశించేందుకు అవసరమైన ఆధ్యాత్మిక మార్గాలను తెరిచి, మనశ్శాంతిని, ఆనందాన్ని అందించి, చివరకు ముక్తి వైపు నడిపించే శక్తి శ్రీమద్భాగవతానికి ఉందని శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అన్నారు. శ్రీసిటీ శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో భాగవత సప్తాహ మహోత్సవం బుధవారంతో దిగ్విజయంగా ముగిసింది. ఆలయ వార్షిక ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీసిటీ సౌజన్యంతో, భాగవత భక్తి సమాజ సభ్యులు ఈనెల 19న భాగవత సప్తాహ మహోత్సవం ప్రారంభించారు. 25 మంది సభ్యుల బృందం వారం రోజుల పాటు ఉదయం 6 నుంచి సాయంత్రం 6.30 వరకు అత్యంత భక్తి శ్రద్ధలతో 12 స్కంధాలతో కూడిన భాగవత శ్లోకాలను పఠించారు. అధ్యాత్మిక జ్ఞాన సముపార్జన చేసే క్రమంలో భాగవత వైశిష్ట్యాన్ని వివరిస్తూ రాష్ట్ర మంతటా ప్రతి నెలా భక్తులు కోరిన చోట వైఎస్సార్ జిల్లా పులివెందుల ప్రాంతానికి చెందిన భాగవత భక్త సమాజ బృందం సప్తాహ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు 366 సప్తాహాలు పూర్తి చేయగా శ్రీసిటీలో 367వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ భాగవత భక్త సమాజ బృందానికి కృతజ్ఞతలు తెలుపుతూ శ్రీసిటీలో శ్రీమద్భాగవత సప్తాహం చేయడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. భాగవత సప్తాహం మన సమాజానికి అత్యంత ప్రయోజనకరమైన యజ్ఞం వంటిదన్నారు. భాగవత భక్త సమాజ సభ్యులను శ్రీసిటీ ప్రతినిధులు మధురెడ్డి, శాస్త్రి తదితరులు శాలువాలతో సత్కరించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ప్రతి కుటుంబానికి 100 రోజుల ఉపాధి


రికార్డులు పరిశీలిస్తున్న ఏపీడీ సరిత

పిచ్చాటూరు: ఉపాధి హామీ పథకం కింద జాబ్‌కార్డులు ఉన్న వారికి ఏడాదికి 100 రోజులు పని కల్పించాలని క్లస్టర్ ఏపీడీ డి.సరిత సూచించారు. బుధవారం ఉపాధి కార్యాలయంలో మండలంలోని ఉపాధి అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏపీడీ మాట్లాడుతూ 100 రోజులు దగ్గర్లో ఉన్న కుటుంబాలను గుర్తించి, వారికి మిగిలి ఉన్న రోజులు పనికి వచ్చేలా చైతన్య పరచాలన్నారు. ప్రస్తుతం పూల సాగుపై రైతులకు అవగాహన కల్పించి, ఉపాధిలో రోజా, మల్లె తోటలు సాగు చేసే విధంగా చూడాలన్నారు. తద్వారా కూలీలకు ఎక్కువ పనులు కల్పించినట్లు అవుతుందని తెలిపారు. ఇంగుడు గుంతలు, మునగతోటల పెంపకం పనులకు ప్రోత్సాహం ఇవ్వాలని తెలిపారు. అనంతరం పనులకు సంబంధించిన రికార్డులను ఆమె పరిశీలించారు. ఏపీఓ నాగభూషణమ్మ, జేఈ పుష్పరాజ్, టీఏ ధనంజయులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

రబీష్ట సిద్ధిరస్తు..

- రబీ వరి నాట్లకు రైతాంగం సన్నద్ధం
- జోరుగా నారుమడులు సిద్ధం


పాండూరు ప్రాంతంలో దుక్కి దున్నుతున్న రైతు

వరదయ్యపాళెం: సత్యవేడు వ్యవసాయశాఖ సబ్ డివిజన్ పరిధిలో వరినాట్లు వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. రానున్న అక్టోబర్ 15 నుంచి ప్రారంభమయ్యే రబీ సీజన్‌కు నాట్లు వేసే విధంగా నారు మడులను సిద్ధం చేసుకుంటున్నారు. వారం రోజుల నుంచి నారుమడులను సాగు చేసేందుకు విత్తనాలు కొనుగోలు, దుక్కి దున్నకాల్లో రైతులు నిమగ్నమయ్యారు. సత్యవేడు సబ్ డివిజన్ పరిధిలోని పిచ్చాటూరు, నాగలాపురం, వరదయ్యపాళెం, సత్యవేడు మండలాల్లో సుమారుగా 14వేల హెక్టార్లలో రబీ సీజన్‌లో ఏటా వరి సాగు చేస్తారు. ఆర్బీకేల ద్వారా ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీహెచ్‌సీ గ్రూపులకు ప్రభుత్వం అందజేసిన సబ్సిడీ ట్రాక్టర్ల ద్వారా రైతులు తక్కువ ధరకే దుక్కి దున్నుకుంటున్నారు. ప్రస్తుతం చెరువుల్లో ఉన్న నీటితో నారుమడులు వేసుకుంటున్నారు. పూర్తిస్థాయిలో వర్షాలు పడి చెరువులు నిండి కలుజులు పారితే వరి సాగు పనులు ముమ్మరం కానుంది.

గంగనీటి కోసం ఎదురుచూపు

ఈ ఏడాది ఇప్పటివరకు అడపదడప ఓ మోస్తరు పాటి వర్షాలు కురుస్తున్నప్పటికీ చెరువులు నిండి కలుజులు పారే పరిస్థితి లేదు. అక్కడక్కడ కొంతమేరకు చెరువులకు నీరు చేరాయి. ప్రధానంగా జిల్లాలోని తూర్పు ప్రాంతమైన సత్యవేడు నియోజకవర్గంలో వ్యవసాయం పూర్తిస్థాయిలో సాగు కావ్వాలంటే తెలుగుగంగ నీరు తప్పనిసరి. ప్రస్తుతం కాలువలో నీరు ఆగిపోవడంతో రబీ సీజన్‌కు చెరువులు నిండలేదని రైతులు చెబుతున్నారు. ఈ నెలాఖరుకైనా గంగనీరు పూర్తిస్థాయిలో విడుదలైతేనే వరినాట్లు సకాలంలో వేసేందుకు వీలవుతుందని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి తెలుగుగంగ నీటిని విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.




అంబూరు పొలాల్లో నారు మడులు, యానాదివెట్టు ప్రాంతంలో వేసిన నాట్లు, మరదవాడ పొలాల్లో నాట్లు వేస్తున్న రైతులు